అంతవరకు చదివిన కథల్లోని వివిధ వ్యక్తులు, వాళ్ల మానసిక స్వభావాలను గురించి ఆలోచిస్తున్న నాకు-


వంటగదిలో నుండి విమల కేకేస్తున్నా వినిపించనే లేదు.

"ఏమండీ! వినిపించుకోరేం? ఎప్పుడూ ఆ వారపత్రికతో యుద్ధమేనా! మరో పని ఆలోచించరా!" అంటూ రంకేసింది విమల.

"వినబడింది.ఎందుకా అరుపు? ఏమైందని?" అంటూ చిరాగ్గా లోని కెళ్లాను, పుస్తకం అక్కడ పడేసి-

"ఏమైంది? ఎగరేసి కొడితే రెండు చెక్కలైంది. మీకేం తీరిగ్గా కథలు, కాకరకాయలు చదువుతూ వుండిపోతారు. ఏ పండుగ ఎప్పుడో తెలుసుకోకపోతే ఎలా?" అంటూ రుసరుసలాడింది విమల.

ఎప్పుడూ ఊరు దిరిగే ఉత్సవ విగ్రహం లాంటి నాలాంటి వారు ఈ దసరా సెలవుల్లో మూలవిరాట్‌లా ఇంట్లోనే ఉండిపోతే- చీటికి మాటికి అక్షింతలు వేయడం భార్యామణులకున్న గొప్ప గుణాల్లో అదొకటని వేరుగా చెప్పవలసిన పనేలేదు కదా!



# యూ ఆర్ ఆల్వేస్ రైట్

## - కల్లూరు రాఘవేంద్రరావు

అందుకే కోపంగా అన్నాను-"వచ్చే పండుగలు వస్తూనే ఉంటాయి. చేస్తూనే ఉంటాం. ఇకేం?" అని.

"ఇప్పుడు దసరా కదా! మరి దుర్గాష్టమి ఎప్పుడు చేయాలో తెలుసుకున్నారా?"అంది విమల నా వంక చురచురా దుర్గాదేవీలా చూస్తూ

"పంచాంగం చూసి చెప్పాగా" అన్నాను

"ఎల్లుండని మీరంటున్నారు. కాదు.. రేపేనట.."

"ఎవరన్నారు?"

"ఎవరనేదేమిటి? ఈ వీధి చివర నుండే సిద్ధాంతుల వారి పెళ్లాం వేంకట లక్ష్మమ్మ గారు" అంది విమల.

దాంతో నా గుండెలో పిడుగుపడినట్లు అయింది. ఎందుకంటే? విమల పండుగ పబ్బాలకు, పూజా పునస్కారాలకు ఇచ్చినంత ప్రాముఖ్యం మరేదానికి ఇవ్వదు.

"అష్టమి ఎల్లుండని పంచాంగాలు ఘోషిస్తూ ఉంటే, ఆవిడ రేపే- అని ఎలా అంటుంది?" గట్టిగా వాదించాను విమలతో.

"ఊరందరిదీ ఓదారైతే ఉలిపికట్టెదోదారి'- అన్నట్లుంది మన వ్యవహారం. ముందెళ్లి సరుకులు పట్రాండి." అంటూ రాణిలా ఆదేశాలు జారీ చేసింది విమల.

"నీ బుద్ధి పాడుగాను! వాళ్ల ఇంట్లో వాళ్లు ఎప్పుడైనా చేసుకోని. మనం ఎల్లుండి చేద్దాం" అన్నాను, ఉన్న విషయం అంతేకదా! అని.

ఆ మాటతో విమలకు ఎక్కడలేని కోపమొచ్చి, "పాడైంది నా బుద్ధి కాదు, మీ బుద్ధే! వేంకట లక్ష్మమ్మ గారంటే ఎవరనుకున్నారు? ఘనాపాఠి, జ్యోతిష మార్తాండ, ఆస్థాన జ్యోతిష విద్వాన్‌గారి భార్య. అలాంటివారి జ్యోతిష్యానికి ఎదురుందా? ముందెళ్లి రేపటి పండక్కి కావలసినవి తెచ్చేపని చూడండి" అంటూ కస్సుబుస్సులాడింది.

నాకో మూల సందేహం పీడిస్తూనే ఉంది. విమల స్వభావం నాకు బాగా తెలుసు. తనకు ఇరుగుపొరుగమ్మల మాటే వేదం. అంతో ఇంతో పంచాంగ పరిజ్ఞానం ఉన్న నన్ను కూడా బురిడీ కొట్టించే పని చేసింది విమల.

ఎందుకైనా మంచిదని మరోసారి పంచాంగం తిప్పాను. నే చెప్పిన దాంట్లో అక్షరం ముక్క పొల్లు పోలేదు. నాకు మాత్రం కసంతా విమల మీదే...

ఎందుకంటే! ఓసారి హరిశ్చంద్రుడినే భర్తగా పొందిన ఓ చంద్రమతి లాంటి ఓ పొరుగింటి ఇల్లాలి మాటనమ్మి, జుట్టు ఎంతో ఏపుగా, అందంగా, నల్లగా పెరుగుతుందని విమల ఆవిడ చిట్కా పాటించబోయింది. 'అవేవి వద్దు. మార్కెట్లో కొన్నవే వాడుకో'మన్నాను.

నామాట తోసేస్తూ, "మీరూరుకోండి! అవన్నీ మా ఆడవాళ్ల విషయాలు"అంటూ కొట్టి పారేసింది.

ఎంతైనా పెరటి మొక్క వైద్యానికి పనికిరాదు కదా!

వారం పది రోజులు గడిచాక విమల తలమీదున్న జుట్టంతా క్రమంగా ఊడడం మొదలు పెట్టింది.

దువ్వుతున్నప్పుడల్లా ఓ చీపురుకట్టంత వెంట్రుకలు దువ్వెనకు చుట్టుకొచ్చేవి. దాంతో నాకు ఒళ్లు మండి...

"చూచావా! ఇప్పుడనుభవించు" అంటూ విసుక్కొన్నాను. అంతకంటే చేసేదేముంది? ఊడేవాటిని అడ్డుకోగలనా?

ఏది ఏమైనా విమల తన తప్పును మాత్రం ఒప్పుకోదు. అన్నీ ఆరిందానిలా మాట్లాడుతుంది. సమర్థించుకుంటూఏదో ఓ జాణతనాన్ని ప్రదర్శించి, 'ఐయాం ఆల్వేస్ రైట్' అని రూఢీ పరచుకుంటుంది.

కొందరికున్న ప్రత్యేక స్వభావమే అది. మనసుండలేక తనను మార్చే ప్రయత్నం చేస్తూ ఒకసారి....

"నీకీ లోకపుతీరు తెలియదు విమలా! మొండిగా వాదిస్తావే తప్ప, ఆలోచించవు. నీ హితులెవరో? శత్రువులెవరో కూడా తెలుసుకోలేవు. పచ్చని కాపురాలను చూచి ఓర్వలేక ఏవేవో చెబుతూ ఉంటారు. అవన్నీ వినీ విననట్లుండాలి. తొందరపడకుండా విన్నది ఆలోచించి ముందుకెళ్లాలి" అని చెవినిల్లు కట్టుకొని చెప్పాను.

ఇలా ఒకటి-రెండు-మూడుసార్లు కాదు కదా!.. వందసార్లు చెప్పాను. వింటేగా? వినదు.



దీనికి తోడు రోజుకో టి.వి. వంట. మండిపోతున్న ఈ అధిక ధరలతో, ఆర్థిక మాంద్యంతో పెద్దపెద్ద దేశాలే తల కిందులవుతున్న ఈ గడ్డుకాలంలో విలువైన రకరకాల వంట సామగ్రిని కొని, కొత్త రకం పాకం దింపి, కొత్తకొత్త రుచులంటూ తినిపించడమేకాక..'ఏమండీ! ఇది'మా వూరివంట' ఇది 'మా ఇంటి వంట', ఇది మా పొరుగిం

టి పుల్లకూర వంట'అని ఏవేవో సొల్లు కబుర్లు చెబుతూ ఉంటే ఒళ్లు మండిపోదూ!

నేనేం యాంకర్‌నా! చేసినవన్నీ నాలుక్కు తగిలీ తగలగానే 'సూపర్-ఫైన్-పెంటాస్టిక్' అనడానికి-

అదేదో వంటో, పెంటో తెలియదు గాని, పొరుగింటావిడ టి.వి.లో చూసి చేసిందని నాకోరోజు వండిపెట్టింది విమల.

నోట్లో పెట్టుకోగానే డోకొచ్చింది.

''ఇదేం వంటా? ప్రాణం తీయడానికా''అంటూ మండిపడ్డాను.

''అయ్యో రామా! ఇది 'నా టి.వి.'లో ఫస్ట్‌ప్రైజ్ వచ్చిన 'కిజీబా' వంటండీ! ఎంత బాగా వండానో..'' అంటూ మరో కప్పులో కొంతపోసి, కిస్మిస్,జీడిపప్పు, బాదామీలు-అందులో వేసింది. అది చాలదన్నట్లు పైన వాటిని గార్నిష్ చేసి, అందమైన వెండిస్పూన్ అందులో ఉంచి, ఘుమఘుమలాడే మాంచి నేయి.. ప్రేమ ఒలక బోస్తూ పోసి, ఒయ్యారంగా వగలు చూపిస్తూ అందించింది.

అదో విచిత్రమైన రంగుల వాల్‌పోస్టర్లు అతికించే చింతపిక్కల పేస్టు లాగుంది. తిన బుద్ధి కాలేదు. ముఖం చిట్లించుకుంటూ చూచాను. అంతే..విమల కోపంగా..

''మీరెప్పుడూ ఇంతే! ఏ ఒక్కటీ చేయనివ్వరు. రోజు ఎంతెంత మంచి వంటలు, కొత్తకొత్తవి టి.వి.లో వస్తుంటాయో మీకేం తెలుసు? మన పక్కింటి సుభద్రమ్మ అక్క రోజూ వీటిని చూసి వాళ్లాయనకు వండి పెడుతుంది. ఆయన ఎంతో ఇష్టంగా తింటారుట''అంది

విమల రుసరుసలాడుతూ..

''అబ్బా! చాలు. నీ పొరుగింటి పురాణం. ముందు దీన్ని ఆ చెత్తకుండీలో పడేయి. నేనా టి.వి.ని తర్వాత పడేస్తాను'' అంటూ గట్టిగా మందలించాను.

దాంతో-ఇక సత్యభామ అలకపాన్పు సీను ప్రారంభం. కోపగృహంలోకి ఉరగాంగనలా ప్రవేశించడం, అగ్నిశిఖలాపైకి లేవడం, తలకట్టు, మాసినచీర, శోకపాన్పు, నిద్రాహార విహారాదులు మానడం..

ఆ కోపమంతా మూడు నాలుగు రోజులు వంటల్లో చూపడం. కడుపు మాడ్చడం.

ఈ దీనస్థితి పొందడం కంటే, 'యూ ఆర్ ఆల్వేస్ రైట్'అనే వేద మంత్రాన్ని పఠించడమే సరైందనే నిర్ణయానికొచ్చి, 'కొందరి స్వభావాలు ఇలా వుంటాయ్' అని మనసును సమాధాన పరచుకుంటూ, పండుగ సరుకులు కొనడం కోసం రెండు చేతి సంచులతో కాళ్లీడ్చుకొంటూ మార్కెట్‌కు బయలుదేరాను.

ఇలా అలా రెండిళ్లు దాటానో లేదో ఓ బట్టలమ్మేవాడి కేక వినబడింది. వెంటనే నాకు వణుకు పుట్టుకొచ్చింది. గజగజ వణికిపోయాను-గతం గుర్తుకొచ్చింది.

విమలకు వీధిలోకొచ్చిన ప్రతిదాన్ని కొనే ఓ చెడ్డ అలవాటుంది. అది ఎలాంటిది? అవసరమా? అనవసరమా? అని కూడా చూడకుండా ఇరుగుపొరుగు వాళ్లు కొన్నారంటే చాలు.ఇకవదలదు. ఒక్కోసారి వాళ్లు వ్యాపారం చేయక పోయినా తానే చేసేస్తుంది. అదే నా భయం. ఆ భయానికి కారణం ఓసారి....

మధురైలో టూరిస్టు బస్సు ఆగింది. అక్కడ చీరలు బాగుంటాయని విమలకు ఎవరో చెప్పారట. ఆ విషయమే బస్సులో పెద్దచర్చ జరుగుతోంది.

అప్పుడే టూరు బస్సు ఏజెంటు తన చేతి మైకులో అనౌన్సు చేస్తున్నాడు. ''ఇక్కడెవ్వరూ ఏ వస్తువు కొనే ప్రయత్నం చేయవద్దండి. మోసపోతారు. ముఖ్యంగా చీరల విషయంలో..'' అంటూ...

నేను విమలను హెచ్చరిద్దామని ''విన్నావా!'' అన్నాను.

''ఆ విన్నాం లేండి! అవన్నీ మీలాంటోళ్లు నూరిపోసినవే...ఆ మాత్రం తెలియదా!'' అంటూ వెటకారంగా మాట్లాడింది.

''మీరు ఎవరి మాట వినరని తెలుసు. ఏమైనా 'వినదగు నెవ్వరు చెప్పిన..' అంటూ చిన్ననాడు బడిలో పంతులు నేర్పిన పద్యం జ్ఞాపకానికొచ్చి తొలి పాదం ఎత్తుకొన్నాను.

''చాలు..చాలు..మీ సుమతి నీతి'' అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది.

మీనాక్షి సుందరేశ్వరుల సందర్శన తరువాత ఆ రాచవీధుల

వెంట నడుస్తూ ఉంటే ఆడవాళ్ల సంతోషానికి అంతే లేదు. ఆ వీధినిండా చీరల షాపులే. షో కేసుల్లో అందంగా ఉంచిన చీరలు, నాణ్యంగా షోకేస్ బొమ్మలకు కట్టిన జిగిబిగి చీరలు, కళ్లకు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి వారికి.

కొందరు షాపుల వాళ్లేమో 'రండి...రండి..' అంటూ వీధిలో కొచ్చి మర్యాదపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు.

ఏజెంటేమో ''టైం లేదు..కదలండి..కదలండి'' అంటూ అందర్నీ తొందర పెడుతున్నాడు. కొందరేమో లోలోపలే విసుక్కుంటున్నారు. విమల మరీ విసిగిపోయి మనసులోనే తిట్టుకొంటూంది.

అతి ప్రయాసతో వాళ్లందర్నీ బస్సు దగ్గరికి చేర్చేపాటికి ఏజెంటుకు తలప్రాణం తోక్కొచ్చింది.

బస్సు నిలచిన చోటే దొరికిందంతా కొనేస్తున్నారు ఆడవాళ్లు. అక్కడి వెండర్స్‌కు రానిభాష లేదు. వాళ్లు తమ తమ మాటల చాకచక్యంతో ఆడవాళ్లను కట్టిపడేస్తున్నారు.

ఇంతలో ఎవడో వందకు మూడు చీరలంటూ బస్సు దగ్గర అరుస్తున్నాడు. వందకు మూడంటే నాకాశ్చర్యమేసింది.

'ముప్పైకో తుండుగుడ్డ కూడా రాదు కదా!' అని ముక్కుమీద వేలేసుకున్నా.

డ్రైవర్ హారన్ కొట్టాడు. ''ఎక్కండమ్మా! ఎక్కండి. ఇంకా చూచే ప్లేసులు చాలా ఉన్నాయి'' అంటూ ఏజెంటు అందర్నీ తొందరపెట్టాడు. ఎక్కినవాళ్లు వాళ్ల సీట్లల్లో వాళ్లు కూర్చున్నారు.

పక్కసీటావిడ''వందకు మూడట, కొంటే పోలా! మూణ్ణెళ్లు కట్టి వాడేస్తే సరి!'' అంటూ వాణ్ణి పిలిచి, వందిచ్చి ఓపాకెట్ కొంది. దాంతో ఒక గొప్ప జాడ మొదలైంది.

విమల కూడ హడావిడిగా ఓ వందిచ్చి పాకెట్ తీసుకొంది. మరికొంత మంది ఇలాగే విండో బిజినెస్ చేసేశారు.

అంతలో బస్సు కదిలింది. చీరలు దొరికిన వాళ్లేమో తమ పూర్వజన్మ సుకృతంగా భావించారు. కొందరేమో తమకా మీనాక్షి దేవి కృప కలుగలేదని వాపోయారు. మరికొందరేమో ఏజెంటు మీద 'ధూం..ధాం..'అంటూ విరుచుకుపడ్డారు.

విమలేమో 'సాధ్యం కాని పారిజాత వృక్షాన్నే సాధించి తన పెరట్లో నాటుకున్న సత్యభామలా- నా మీదికి జడ విసిరింది. అది నా ముక్కు పుటల్లో దూరిందేమో ఒకటే తుమ్ములు.

యాత్ర తరువాత ఇంటికొచ్చి ఆ చీర పాకెట్ తీసి చూస్తే, ఏముంది? మూడు తుండు చీరలున్నాయి. రెండు మూడు చీర పీసులు జాయింట్ చేసి కుట్టి ఆడవాళ్ల నెత్తిమీద రంగుల కుచ్చు టోపీ పెట్టాడు వాడు.

''చూశావా! ఏంజరిగిందో!'' అన్నాను నవ్వుతూ

''దీనికంతటికీ కారణం, మీ అపశకునపు తుమ్ములే. ఇంతకు ఎంత పెట్టాంలేండి. వందేకదా? పనిమనిషికిస్తే పోలా! కళ్లకద్దుకొని మరీ కట్టుకుంటుంది'' అంది విమల తాను చేసిందల్లా రైటేనని సమర్థించుకొంటూ...

మరేం మాట్లాడకుండా 'యూ ఆర్ ఆల్వేస్ రైట్' అనే వేద మంత్రాన్ని మరోసారి పఠించి మౌన ముద్ర దాల్చాను.

ఆ తరువాత తెలిసింది. పనిమనిషి కూడ ఆ చీరలను రిజెక్టు చేసిందని. కాలక్రమేణ అవి అలికే గుడ్డలుగా రూపాంతరం చెందాయనే విషయం జ్ఞప్తికొచ్చి ఒకసారి నవ్వుకుంటూ అంగడి చేరాను.

***

ఆ రోజు దుర్గాష్టమి. పండుగ భోజనం ముగించి ఈజ్ చేర్‌లో కూర్చొని తాంబూలం వేసుకొంటున్నాను.

చేతిలో తాంబూలపు పళ్లెం పట్టుకొని విమల రుసరుసలాడుతూ గుమ్మం దాటి లోనికి రావడం చూచాను.

ఎందుకో విమల కళ్లు ఎర్రగాను, ముఖం కోపంగాను కనిపించింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బలంగా వదులుతూంది. పగబట్టిన పాములా బుసకొడుతూంది. 'ఏం పొరబాటు జరిగిందో ఏమో!' అని హడలిపోతూ 'ఏం సంగతి?' అని ప్రశ్నించాను తలాడిస్తూ...

''దుర్గాష్టమి ఈరోజని చెప్పి, వాళ్లు మాత్రం రేపు చేయడం ఏమిటి?'' అంటూ బుసకొట్టింది విమల నాగులా.

నాకర్థం కాక-''వాళ్లంటే..'' అని అడిగాను అనుమానంగా.

''ఇంకెవరు? ఆ ఘనాపాఠి జ్యోతిష పండితుల విషయమే!'' అంది విమల వ్యంగ్యంగా..

''ఇప్పుడేం? మనం వాళ్లు చెప్పినట్లు చేశాం కదా?''

''మనం చేశాం. వాళ్లు రేపు చేస్తారట''

''పండుగ ఈ వేళయితే రేపు చేయడమేమిటి?''

''వాళ్లాయన ఈవేళ సరుకులు తేలేదట. రేపు తెస్తాను...చేయమన్నాడట..'' అంది విమల మండిపోతూ...

''అంటే -పండుగ వాళ్లాయన మీద ఆధారపడిందన్నమాట. ఆ మాత్రానికి పంచాంగం ఎందుకు?''అన్నాను కోపంగా

''అది అడిగిన వాళ్లకు చెప్పేటందుకే'' అంది విమల.

నాకో గొప్ప వేమన నీతి బోధించేదానిలా. లోలోన నవ్వుకొంటూ..'' ఐ థింక్ యూ ఆర్ ఆల్వేస్ రైట్'' అంటూ'బ్రేవ్'మని త్రేంచాను. వెంటనే విమల ''నో..నో.. ఐయాం ఆల్వేస్ రాంగ్'' అంటూ నాలుగు ఇంగ్లీషు ముక్కలు మాట్లాడుతూ, వంటింట్లోకెళ్లి భోజనానికి ఉపక్రమిస్తుంటే, నేను తృప్తిగా 'ఓ తులసీదళం సత్యకు గుణపాఠం చెప్పినట్లుగానే' వుందని నవ్వుకొంటూ ఈజీ చేర్లో విశ్రాంతిగా నడుంవాల్చి, నిద్రలోకి జారుకున్నాను. ❑

రచయిత సెల్ నెం: 9490421673

